'బొమ్మ'కు బ్రేక్

- పెద్ద సినిమాలు లేక వినోదానికి విరామం
- చిన్న సినిమాలకు ప్రేక్షకులు కరువు
- వారం రోజులుగా థియేటర్లు బంద్


సిరిసిల్లలో తాత్కాలికంగా మూసి ఉన్న సినిమా థియేటర్

సిరిసిల్ల ఎడ్యుకేషన్: వినోదాలు, విహారయాత్రలు, ఆట పాటలకు విద్యాలయాల సెలవులు నెలవులుగా నిలుస్తాయి. కానీ ఈ ఏడాది సమ్మర్ వెకేషన్ అంతా రాజకీయ నాయకులు ఓట్ల ప్రచారంతో ముగిసినట్లు జిల్లాలో చర్చ జరుగుతోంది. సిరిసిల్ల, వేములవాడలోని సినిమా థియేటర్లు వారం రోజులుగా మూతపడ్డాయి. పెద్ద సినిమాలు లేవని, చిన్న సినిమాలు ఆడించినా ఆర్థికంగా గిట్టుబాటు కాదని థియేటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. రెండు మూడు రోజుల్లో ఓ రెండు సినిమాలు విడుదల కానున్నాయని, మళ్లీ సినిమా థియేటర్లు తెరుచుకునే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు.

ఆంధ్రాఎన్నికల ఎఫెక్ట్ ..

సినిమాల్లో ఎక్కువగా రాణిస్తున్న వాళ్లు, అందులో పెట్టుబడులు పెట్టేవారు, ఆ సినిమాలను చూసేవారు కూడా ఆంధ్రవారన్న అభిప్రాయాలున్నాయి. అక్కడ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఉండటంతో చాలామంది సినిమా హీరోలు, బుల్లి తెర నటులు పాల్గొనడంతో అసలు సినిమాల నిర్మాణం జరగలేదని విశ్వసనీయ సమాచారం. దీంతో ఇక సింగిల్ స్క్రీన్‌పై కనీస టార్గెట్ అమౌంట్ రాబట్టే సినిమాలు లేకపోవడంతో జిల్లాలోని సినిమా థియేటర్లు వారం రోజులులు మూతపడ్డాయి. తెలంగాణలోనూ పార్లమెంట్ ఎన్నికల ప్రచారాలు, వేసవి సెలవుల్లో పెద్దలు బిజీబిజీగా ఉన్నట్లు సమాచారం ఈనెల 25 నుంచి మళ్లీ సినిమాలు విడుదల అవుతాయని జిల్లాలోని థియేటర్లలో సినిమాలు నడుస్తాయని విశ్వసనీయ సమాచారం.

ప్రత్యామ్నాయ మార్గాల్లో..

సినిమాలను థియేటర్లలో చూసే వారి సంఖ్య తగ్గింది. కొత్తగా నిర్మించిన చిన్న సినిమాలను ఓటీటీ వేదికగా విడుదలు చేస్తుండగా ఇంట్లోనే వీక్షిస్తున్నారు. పెద్ద సినిమాలు సినిమా హాల్స్‌కు వచ్చినా గతంలో మాదిరి హంగామా చేసి చూసే విధానాలకు స్వస్తి పలికి ఏదేని ఓ వెబ్‌సైట్‌లో పైరసీ దానిలో చూసి సంతృప్తి చెందుతున్నారు. ఇటు చిన్న సినిమాలతో వెళ్లదీయ లేక, పెద్ద సినిమాలకు అనుకున్న స్థాయిలో జనాలు రాక, పైరసీ బెడదతో సినిమా థియేటర్లు నెమ్మదిగా మూతబడేస్థితికి చేరుకుంటున్నట్లు అందులో పనిచేస్తున్న కార్మికుడొకరు తెలిపారు.

ఈ ఏడాది భిన్నం..

దసరా, సంక్రాంతి, దీపావళితోపాటు వేసవి సెలవులు సినిమాలు ఆడేందుకు అనువైన సమయాలు. కానీ ఈ ఏడాది కాస్త భిన్నంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సెలవుల్లో ఒక్క పెద్ద హీరో సినిమాలు విడుదల కాలేదని వాపోతున్నారు. పెద్ద హీరోల సినిమాలున్నా అవి ఇప్పుడే థియేటర్‌కి వచ్చే పరిస్థితి లేదు. దీంతో చిన్న సినిమాలతో థియేటర్లు తెరచి అందులో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు జీతాలు ఇచ్చేలా ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల ప్రభావం ఉంది

ఎన్నికల ప్రభావం సినిమాలపై అధికంగా ఉంది. ప్రజలంతా అందులో బిజీగా ఉన్నారు. దీనికి తోడు అనుకున్న స్థాయిలో ఆడే సినిమాలు విడుదల కాలేదు. దీని కారణంగానే సినిమా హాల్‌ను తాత్కాలికంగా బంద్ చేశాం. రెండు మూడు రోజుల్లో కొత్త సినిమాతో మళ్లీ థియేటర్‌ను యథావిధిగా నడిపిస్తాం.

– రవి, మేనేజర్, విమల్‌టాకీస్, సిరిసిల్ల

ఈ వారం కొత్త సినిమాలు

పెద్ద సినిమాలు లేక సింగిల్ స్క్రీన్ థియేటర్లు బంద్ ఉన్నాయి. మల్టీప్లెక్స్ థియేటర్స్‌లో సినిమాలు ఆడుతున్నాయి. ఆంధ్ర ఎన్నికల ప్రభావం ఉంది. ఈ వారం కొత్త సినిమాలు వస్తాయి. థియేటర్స్‌లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు జీతాల విషయంలో ఇబ్బంది రానివ్వరు.

– ప్రణయ్, ఏషియన్ నటరాజ్ మేనేజర్, సిరిసిల్ల

క్లుప్తంగా

ఘనంగా ఎల్లమ్మ సిద్ధోగం


మొక్కులు చెల్లించుకుంటున్న మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రేణుక, జమదగ్ని కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. ఎల్లమ్మ, నాగెల్లి పెద్ద పట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో గౌడ సంఘం బాధ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు పనులు పూర్తిచేయాలి

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఎంపీడీవో శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఫాజుల్‌నగర్, వట్టెంల, చెక్కపల్లి, ఎదురుగట్ల గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. నెలాఖరు వరకు పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

23న క్రీడాపోటీలు

ముస్తాబాద్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దోస్తీ మీట్‌లో భాగంగా యువతకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీలు నిర్వహించన్నునట్లు తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల యువకులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనాలని కోరారు. ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు ప్రదానం చేస్తామని, ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపికచేస్తామన్నారు.

సకాలంలో యూనిఫామ్స్ అందించాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలో పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా స్కూల్ యూనిఫాంలు కుట్టి అందించాలని డీపీఎం పద్మయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేటలోని మహిళా శక్తి గ్రూప్ కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం సెర్ప్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఏపీఎం మల్లేశం, సీసీలు నాయక్, సుదర్శన్, రమణ, నాగరాజు, దేవేందర్, సుధాకర్, పద్మ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ కల్యాణం

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో గంగమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గంగమ్మ తల్లి కల్యాణం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, కాంగ్రెస్ పార్లమెంట్ కో కన్వీనర్ చక్రధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గౌతంరావు, ఎన్ఆర్ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు ధర్మేందర్, ఆలయ కమిటీ బాధ్యులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్లలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి తెలిపారు. ఎదురుగట్లకు చెందిన పస్తం శ్రీనివాస్ అక్రమంగా ఆటోలో తరలిస్తున్న దాదాపు 13 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

పచ్చిగడ్డి తిని 12 గొర్రెలు మృతి

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని మల్లుపల్లిలో బూరవేని మల్లయ్యకు చెందిన 12 గొర్రెలు పచ్చిగడ్డి(తర్రగడ్డి), వడ్లు తిని మంగళవారం మృత్యువాతపడ్డాయి. మండల పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ మిగతా గొర్రెలకు సకాలంలో వైద్యం అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాయి. మూగజీవాల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్న తమకు తీరని నష్టం జరిగిందని బాధితుడు బోరుమన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

గంజాయి పట్టివేత

బోయినపలి : మండలకేంద్రంలోని వ్యవసాయ గోదాం వెనుక ఓ వ్యక్తి నుంచి 113 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీ నివాస్ మంగళవారం రాత్రి తెలిపారు. సిరిసిల్ల మండలం బోనాల గ్రామానికి చెందిన ప్రశాంత్ బోయినపల్లిలో గంజాయి విక్రయించడానికి వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు కాపు కాసి ప్రశాంత్‌ను చాకచక్యంగా పట్టుకుని గంజాయితో పాటు, సెల్‌ఫోన్ స్వా ధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీ ఐ పేర్కొన్నారు. ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



సిరిసిల్లటౌన్: అటు తడిసిన ధాన్యం.. ఇటు వడగళ్లతో వరి, మామిడి, ఇతర పంటలు నష్టపోయిన రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు కోరారు. మంగళవారం సిరిసిల్ల బీజేపీ కార్యాలయంలో నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు సన్నాలకే రూ.500 బోనస్ ఇస్తామనడం శోచనీయమన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అకాలవర్షాలకు తడుస్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఫసల్‌బీమాను రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీజేపీ నిరంతర పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్టె వేంకటేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, గజభీంకార్ చందు, నవీన్‌యాదవ్, వేణు, కొండ నరేశ్, కోడం శ్రీనివాస్, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడి ఆలయంలో పూజలు



వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆనుబంధ దేవాలయమైన నాంపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి బ్రహ్మోత్సవల్లో భాగంగా ఉదయం స్వామివారికి పంచసూక్త అభిషేకం, హవనం, మధ్యాహ్నం మహానివేదన, సుదర్శన నరసింహహవనం, సాయంత్రం నిత్య పూర్ణహుతి, హోమం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణం..

నాంపల్లి గుట్టపై లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గంగాధర అంజయ్య కుటుంబానికి 1995వ బ్యాచ్ ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది బాసటగా నిలిచారు. స్వచ్ఛందంగా రూ.1.80 లక్షలు మృతుని కుటుంబ సభ్యులకు ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం అందించారు. ఆర్ఐ యాదగిరి, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, మల్లేశం, ప్రభాకర్, బాలు, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా రైతుల ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో మాట్లాడారు. రైతుల సమస్యలు ప్రభుత్వం గాలికొదిలేసి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అమెరికాకు, ఎమ్మెల్యే దుబాయ్‌కు వెళ్లారన్నారు. వేములవాడ సహకార సంఘం పరిధిలోనే ఇంకా 60 వేల క్వింటాళ్లు కల్లాల్లోనే ఉన్నాయన్నారు. తూకం వేసిన 10 వేల బస్తాలు కూడా కల్లాల్లోనే మగ్గుతున్నాయన్నారు. మళ్లీ అకాల వర్షాలు వస్తే రైతుల పరిస్థితి ఏంటన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు రూ. 5.04 లక్షలు ఎప్పుడిస్తారో చెప్పాలన్నారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, జోగిని శంకర్, సిరిగిరి రాంచందర్, నరాల శేఖర్, గోలి మహేశ్, నాయకులు వెంగళ శ్రీకాంత్, ఈర్లపల్లి రాజు, కమలాకర్ రెడ్డి, పాల్గొన్నారు.

అన్ని రకాల వడ్లకూ బోనస్ ఇవ్వాలి


వీర్నపల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గంభీరావుపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులు పండించిన దొడ్డు, సన్నరకం వడ్లకు ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు గంభీరావుపేట మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కేవలం సన్న రకం వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీఆర్ఎస్ పట్టణశాఖ అధ్యక్షులు వెంకటి యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, నాయకులు లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, గడ్డి హరీష్, పాల్గొన్నారు.

ముస్తాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు పోతుగల్ ఏఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు సురేందర్‌రావు, నాయకులు సర్వర్, నర్సింహారెడ్డి, సంతోష్‌రావు, చెవుల మల్లేశ్, భరత్, మనోహర్, స్వామి, గిరి, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి మాట్లాడారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు కొండ రమేశ్‌గౌడ్ ,శ్రీనివాస్, కిషన్, ఎల్లయ్య, నర్సాగౌడ్, అనసూయ, బాలాగౌడ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మండల సెస్ డైరెక్టర్ మల్లేశం, జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, మాజీ ఉపసర్పంచ్ రవి, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై తప్పుడు ఆరోపణలు

రుద్రంగి: ధాన్యం కొనుగోళ్ల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తమ ఉనికి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని జెడ్పీటీసీ గట్ల మీనయ్య, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం కంటే ప్రభుత్వం ఎక్కువ ధాన్యం సేకరించిందన్నారు. అకాలవర్షాలు కురవడంతో ధాన్యం కొనుగోళ్లలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయన్నారు. ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీలతను కోరారు. జెడ్పీటీసీ గట్ల మీనయ్య, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, డీసీసీ కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, నాయకుల ఎర్రం గంగనర్సయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్ గ్రామ శివారులోని మానేర్ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. వాహనాన్ని సీజ్‌చేసి డ్రైవర్ పూదరి రాకేశ్, యాజమాని గోగూరి ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎస్సై పేర్కొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న పోలీసులు

వేములవాడరూరల్: గ్రామాల్లో ఐకమత్యంగా ఉండి ప్రతి వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ సూచించారు. వెంకటాంపల్లిలో గ్రామస్తులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. సీసీ కెమెరాలతో దొంగతనాలు, నేరాలను నియంత్రించవచ్చన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు అని, గ్రామంలో అందరూ కలిసికట్టుగా గ్రామ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై మారుతి, ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వ, మాజీ ప్రజాప్రతినిధులు బండ శ్రీనివాస్, ఆవునూరి ప్రభాకర్, కట్కం చంద్రయ్య, బొడ్డు రాములు, గ్రామస్తులు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ఎంబసీ ప్రతినిధులతో చర్చలు


దుబాయ్ ప్రతినిధులతో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: దుబాయ్ పర్యటనకు వెళ్లిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం బిజీబిజీగా గడిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యలపై దుబాయ్ కాన్సులేట్, అబుదాబిలోని ఇండియన్ ఎంబసీలను సందర్శించి వారితో చర్చించారు. దుబాయ్ కౌన్సిలేట్‌లో కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన శ్రీక్రాంత్ 2015 నుంచి దుబాయ్‌లో మిస్సింగ్ ఉన్నందున కౌన్సిల్ బిజేందర్‌తో మా ట్లాడి పోలీసులకు అధికారిక ఈ–మెయిల్ తెప్పించినట్లు చెప్పారు. త్వరలోనే శ్రీకాంత్ వివరాలు ఎమ్మెల్యేకు తెలియపరుస్తామని హామీ ఇచ్చారు. అబుదాబి ఎంబెస్సీ కౌన్సిలర్ బాలాజీస్వామితో కలిసి మోత్కురావుపేటకు చెందిన గణేశ్ మృతదేహం స్వగ్రామానికి తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏడాదిన్నరగా ఓ కేసులో జైల్లో ఉన్న కథలాపూర్, చింతకుంట వాసి కుంట వంశీ కేసులో కుటుంబ సభ్యులతో వీడియో కాల్ మాట్లాడించేలా చూడాలని ఎంబెస్సీ అధికారికి విజ్ఞప్తి చేశారు.

గత ఏడాదికంటే ఎక్కువ కొనుగోలు

గత ప్రభుత్వ హయాంలో కంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సీజన్‌లో ఇప్పటికే తాము 2,24,523 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. దుబాయ్ నుంచి సాక్షితో మాట్లాడారు. రైతుల గురించి ప్రభుత్వం ఆలోచిస్తుందనడానికి ఇవే నిదర్శనమన్నారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో ఉపాధి హామీ కూలీలపై మట్టి పెల్లలు పడ్డాయని తెలియగానే అధికారులను ఘటనా స్థలానికి వెళ్లాలని సూచించినట్లు తెలిపారు.

వైభవంగా లక్ష్మీ నారసింహుడి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంభీరావుపేట: మండలంలోని నాగంపేటలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య జరిగిన కల్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలకించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు మురళి, శ్రీమాన్ శేష బట్టార్ కృష్ణమాచార్య, వేద పండితులు, ఎంపీటీసీ నాగభూషణం, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

క్రీడాకారులు పోటీతత్వం అలవర్చుకోవాలి

ఎల్లారెడ్డిపేట: గ్రామీణ ప్రాంత క్రీడాకారులు పోటీతత్వం అలవర్చుకొని క్రీడల్లో ముందుకెళ్లాలని ఆర్ఐ రామకృష్ణ, పీఈటీ ప్రభాకర్ అన్నారు. మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ వాలీబాల్ క్రీడాకారులకు జగిత్యాల జిల్లాలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆర్ఐగా పని చేస్తున్న రామకృష్ణ క్రీడాకారులకు నగదు పండ్లు మంగళవారం అందించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

చందుర్తి: బైక్ అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లికి చెందిన దేవస్వామి,, దేవమల్లయ్య మంగళవారం ఉదయం మండలంలోని మల్యాలలో జరిగే పెద్దకర్మకు వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో చందుర్తి –మల్యాల గ్రామ శివారులో గల కోళ్ల పారం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీ కొంది. దీంతో ఇద్దరు కిందపడగా తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం 108లో వేములవాడ సివిల్ ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్ ఢీకొని ఒకరికి ..

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లి పరిసరాల్లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ టీవీఎస్‌పై వేములవాడ నుంచి కొత్తపల్లి వెళ్లడానికి బోయినపల్లి వైపు వస్తున్నాడు. ఇదే సమయంలో వేములవాడ వైపు వెళ్తున్న ఓ టిప్పర్ శ్రీనివాస్ వాహనాన్ని స్తంభంపల్లి గ్రామ పరిసరాల్లో ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు గాయాలైనట్లు వారు పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వేములవాడ రూరల్: వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామానికి చెందిన ఈసంపెల్లి పద్మకు దాతల సాయంతో మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు మంగళవారం ఆర్థికసాయం అందించింది. పద్మకు చెందిన రేకుల షెడ్ వారంక్రితం గాలివానకు కూలిపోయాయి. తనను ఆదుకోవాలని కోరగా మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు, ఇతరులు కలిసి రూ. 6,946 జమచేయగా కొంతకలిపి రూ. 10 వేలు మంగళవారం అందించారు. ఆర్థిక సాయం అందించేవారు వారి విరాళాలు 89855 88060 అందించాలని మై వేములవాడ ట్రస్టు సభ్యుడు మధు మహేశ్ కోరారు. హన్మాజిపేట, మల్లారం, రాజీవ్ నగర్, నిమ్మపల్లి, బాబుసాయిపేట గ్రామాల్లో ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందించారన్నారు. ట్రస్టు సభ్యులు మధు మహేశ్, పాలాస రాజేందర్, పసూల శ్రీనివాస్ బొల్లారం గ్రామానికి చెందిన తదిగొప్పుల గోవర్ధన్, రాజయ్య ఉన్నారు.

పరామర్శ

కోనరావుపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మారుపాక రాజవ్వ మృతిచెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన రాజవ్వ ఉపాధిహామీ పనులకు వెళ్లి మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయనవెంట నాయకులు దర్శనాల లక్ష్మణ్, నరేశ్, మల్లయ్య, సత్తయ్య, తదితరులున్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరానగర్ గ్రామం భరత్‌నగర్‌లో ఇటీవల పిడుగుపాటుతో రుద్రారపు చంద్రయ్య మృతిచెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి పరామర్శించారు. అనంతరం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నాయకులున్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించండి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పిస్తే నాణ్యమైన విద్యాబోధన అందుతుందని కళాశాల అధ్యాపకులు ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. మండలంలోని బండలింగంపల్లి, గొరింట్యాల, మల్లుపల్లె, సింగారంలో మంగళవారం ఇంటింటా తమ పిల్లలను సర్కార్ కళాశాలలో చేర్పించాలని కోరారు. కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారు. అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, పర్శరాములు, మాదాసు చంద్రమౌళి, నీరటి విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేత

ఎల్లారెడ్డిపేట: మిత్రుడు అనారోగ్యానికి గురికాగా మిత్రయూత్ సభ్యులు బాసటగా నిలిచారు. మండలకేంద్రానికి చెందిన జోగుల నాంపల్లి కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈవిషయం తెలుసుకున్న నాంపల్లి మిత్రులు స్పందించి రూ.22వేలు మంగళవారం అందించారు. ఇక్కడ మిత్రయూత్ సభ్యులు స్వామిగౌడ్, కృష్ణారెడ్డి, వెంకట నరసింహారెడ్డి, దేవేందర్, రాఘవేందర్, సంజీవ్, సంతోష్ తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ మార్కండేయ ఆలయానికి సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి రూ.35వేల విలువగల కుర్చీల ను మంగళవారం విరాళంగా అందించారు. ఆలయ కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి దంపతులకు ఘనంగా సన్మానించారు.

రుద్రవరంలో పోలీస్ మీకోసం


మాట్లాడుతున్న సీఐ వీరప్రసాద్

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో మంగళవారం పోలీస్ మీకోసం కార్యక్రమం నిర్వహించారు. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీఐ వీరప్రసాద్, ఎస్సై అంజయ్య, ఎంపీటీసీ గాలిపల్లి స్వామి, మాజీ సర్పంచులు ఊరడి రాంరెడ్డి, భూమయ్య, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో హోమం

బోయినపల్లి: మండలంలోని తడగొండలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం హోమం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. పూజారులు చక్రపాణి ఆచార్య, అనిల్ ఆచార్య, హరికృష్ణ ఆచార్య, సాయిశర్మ హోమం నిర్వహించారు. శ్రీనివాస దీక్షాస్వాములు పాల్గొన్నారు.

ఘన నివాళి



వేములవాడ రూరల్/ బోయినపల్లి /ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/రుద్రంగి/చందుర్తి/కోనరావుపేట: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం సిరిసిల్ల, నియోజకవర్గాల్లోని మండలకేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటం వద్ద పూల మాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.